# సంపాదకీయము

ఆధ్యాత్మిక యుగ ప్రస్థాన పురుషోత్తములు, మన సంస్థకు మూల పురుషులు, ఆధ్యాత్మిక మార్గములో పురోగమించుటకు తపనగల వారికి, వారి చైతన్యమును ఉన్నత స్థితులకు చేరుకొని సరియైన మార్గములో నడచుటకు నిత్యము తన చేయూత నిచ్చి నడిపించుటకు, పూజ్య గురుదేవులు శ్రీ బాబూజీ మహారాజ్ వారిని మనకు ప్రసాదించిన మహానుభావులు, ఫతేఘర్ వాస్తవ్యులైన మహాత్మ శ్రీ రామచంద్రజీ మహారాజ్ వారి జన్మదినోత్సవమును భక్తి, శ్రద్ధలతో జరుపుకొనుటకు మనందరము సమావేశమైనాము.

ఈ భువిలో జన్మించిన అందరూ ఆనందమైన జీవితమును కోరుకొంటారు. పూజ్య బాబూజీ మహారాజ్ తమ దశాదేశములలో ఆనందమైన స్థితి దివ్యత్వమునకు తరువాత స్థితిగా భావించదగినదని చెప్పినారు. మనలోని దివ్యత్వముతో సహచర్యము చేయుచు భౌతికమైన జీవితమును గడిపినపుడే సమత్వమును పొంది ఆనందమైన జీవితమును అనుభవించెదము. కాని అటువంటి జీవన విధానమును మన నిత్య జీవితములో ఏవిధముగా పొందగలమనునది మనము తెలుసుకొనవలెను. ప్రపంచములోని మేధా సంపన్నులు కూడా ఎన్ని భోగ భాగ్యములననుభవించినప్పటికి దీనిని పొందలేక పోయినారనునది మనకు తెలిసినదే. బుద్ధి బలము, మేధాశక్తి దాని పరిధులకు పరిమితమై, మనసు తాను నమ్మిన సిద్ధాంతములకు కట్టుబడి యుండుట వలన, ఆ పరిధిని దాటి పోలేము. పవిత్రమైన గ్రంథములనుండి పరతత్వమును గురించి తెలుసుకొనినంత మాత్రమున సరిపోదు. దానిని మన అనుభవములోనికి తెచ్చుకొనుటకు మనమే తగిన ప్రయత్నము చేయవలెను. ఈ ప్రయత్నములో పరిశుద్ధమైన మనసు మాత్రమే సరియగు అవగాహన కలుగజేయును. ఇదియే మన నిజస్థితిని పొందుటకు తగిన సాధనము. సృష్టి ప్రారంభము కావలెనను సంకల్పము జరిగినపుడు ఉద్భవించిన శక్తియే ఆది మనస్సు. దానితోపాటుగా వచ్చిన పరిశుద్ధత మనలో వున్నది. మనసుకు తప్పుడు సంకేతములను యిచ్చినపుడు అది తన నిర్మలత్వమును కాపాడుకొనుటకు వీటిని బయటకు నెట్టివేయును. దీనివలన మనకు అనేకమైన ఆలోచనలు వచ్చి కలతపెట్టును. పూజ్య బాబూజీ మహారాజ్ వారు మనకు అందజేసిన శ్రీ రామచంద్ర రాజయోగ విధానములో హృదయమును ఊర్ధ్వ, అధోభాగములుగా విభజించినారు. మానవ చైతన్యములోని అధికభాగము నిమ్న భాగమునకే పరిమిత మగుటవలన, దాని స్వభావము నిమ్న వైఖరులకు సంబంధించినదైనందున, దాని సంకేతములనే మనసు గ్రహించి, ప్రాపంచిక పరిధులకే పరిమితమై తన నిజస్థితియైన నిర్మలత్వమును గుర్తించలేకపోవుచున్నది. గురుదేవుల కృపవలన మనకు లభించిన ప్రాణాహుతి సహాయమును స్వీకరించి, భక్తిశ్రద్ధలతో వారు

మనకిచ్చిన సాధనలను ఆచరించినపుడే ఈ చైతన్యములోని అధిక భాగము క్రమానుసారము హృదయములోని ఊర్ధ్వ భాగమునకు చేరుకొని స్థిరపడినపుడు దీని ప్రభావమువలన మనసుకు తన నిజస్థితియైన నిర్మలత్వము అనుభవములోనికి వచ్చును. ఈవిధముగా క్రమానుసారము మన పురోగతి దివ్యత్వమువైపునకు కొనసాగుచుండుటవలన సమత్వస్థితి నెలకొని, మనసు దివ్యత్వగుణములను సంతరించుకొని మన నిత్యజీవితములో ఆనందమైన జీవితము కొనసాగించుటకు తోడ్పడును. ఇది యంతయు ప్రాణాహుతివలన మాత్రమే సంభవమని శ్రీరామచంద్ర రాజయోగమును అభ్యాసము చేయుచున్న మనందరికి విదితమే. మనకు లభించిన ఈ అవకాశమును సద్వినియోగపరచుకొని గురుదేవుల కృపా కటాక్షములను పొంది, ఆనందమైన జీవితమును సాగించెదము.

- వి.రామం